క్లుప్తంగా

మత్స్య సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన మత్స్య సహకార సంఘం సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న అధికారులు

రంగంపేట: మండల పరిధిలోని కోటపాడు గ్రామ మత్స్య సహకార సంఘం ఎన్నిక మంగళవారం నిర్వహించినట్లు సీనియర్ ఆడిటర్, రాజమహేంద్రవరం డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఏఆర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికలో కోటపాడు గ్రామ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా కొపారపు అప్పారావు, సెక్రటరీగా దాసరి గోపి, డైరెక్టర్లుగా రాయుడు దడికి, నూతలపాటి కృష్ణ, సైన్నం బ్రహ్మాజీ, సరుగోలు గోపి, సుబ్బారావు, కన్నాబత్తుల శ్రీను, నూకతట్టు రాజశేఖర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కడియం ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ డి.గోపాల్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నేతల సమావేశం

మధురపూడి: కోరుకొండలోని పీఆర్టీయూ కార్యాలయంలో మంగళవారం సంఘ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దాన్యేలుబాబు, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సాంబశివరావు, ఇతర నాయకులు హాజరయ్యారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావు విజయానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని మెయిన్‌రోడ్డులో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి డీఎంఎఫ్ నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

జీవీకే కన్వెన్షన్ హోల్ పరిశీలన

సీతానగరం: చినకొండేపూడిలో ఉన్న జీవీకే కన్వెన్షన్ హాల్‌ను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకరరావు మంగళవారం పరిశీలించారు. చినకొండేపూడికి చెందిన అడ్వకేట్ చిడిపి నకుల సురేష్ గతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకరరావు జీవీకే కన్వెన్షన్ హాల్‌ను సందర్శించారు. గతంలో ఇది థియేటర్‌గా ఉండేదని, ఎటువంటి అనుమతులు లేకుండా కన్వెన్షన్ హాల్‌గా మార్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎదురుగా పెట్రోల్ బంక్ ఉందని, ఇక్కడ ఎటువంటి ఫైర్ సేఫ్టీ లేదని, అలాగే పార్కింగ్ సమస్య ఉందని ఫిర్యాదులో వివరించారు. దీనిపై కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఈఈ శంకరరావు తెలిపారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

రంగంపేట: సారా స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. మండల పరిధిలోని వడిశలేరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, రాజమహేంద్రవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి మంగళవారం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 75 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. వడిశలేరు గ్రామానికి చెందిన కొండేటి నల్లమ్మ, రాజానగరం మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన బొల్లేపల్లి వీరబాబులపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కాలు జారిపడి వ్యక్తి మృతి



మృతుడు శివాజీ (ఫైల్)

బిక్కవోలు: పందలపాకకు చెందిన బదిరెడ్డి శివాజీ (53) బాత్రూమ్‌లో కాలు జారిపడి గాయాలపాలై మృతి చెందాడు. ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బదిరెడ్డి శివాజీ తాపీ పని చేసేవాడు. ఇటీవల చిన్న ప్రమాదానికి గుర్తై ఇంటి వద్దే ఉంటున్నాడు. ఎప్పటికి లాగే మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్రూమ్‌కు వెళ్లాడు. అక్కడ కాలుజారి పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. అతడిని భార్య, బంధువులు కలిసి అనపర్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వెళ్లగా, వైద్యులు పరీక్ష చేసి మృతి చెందినట్లు తెలిపారు. శివాజీ భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

సీతానగరం: త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ ఎం భారతి, ఈఓపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, జల వనరుల శాఖ ఏఈ శివరామకృష్ణ, ఇద్దరు ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో కొనసాగింది. ఎన్నికల విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మండలంలో పురుషోత్తపట్నం, చినకొండేపూడి, మునికూడలి, నాగంపల్లి, రఘుదేవపురంల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. సుమారుగా 14 వేల మంది రైతులు ఉన్నారని తెలిపారు. 2022 నాటి నీటి పన్ను బకాయిలు లేనివారు ఎన్నికల్లో పోటీ చేయవచ్చన్నారు. ఆయా గ్రామాల పాఠశాలల్లో ఈ నెల 8న పోలింగ్ ఉంటుందన్నారు.

వ్యయసాయానికి కళ్లెం

- వెదజల్లు పద్ధతిలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- అధిక శాతం మొగ్గుచూపుతున్న రైతులు
- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో ఐదు శాతం మేర పూర్తి
- మొత్తం 57,442 ఎకరాల్లో వరి సాగు
- ఖర్చు, సమయం ఆదా



జి.మామిడాడలో వెదజల్లు సాగు చేస్తున్న పొలం

పెదపూడి: వ్యవసాయ ఖర్చులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలతో పాటు, కూలీ ఖర్చులు తడిసి మోపుడవ్వడంతో రైతులు నాట్లు వేసే పద్ధతికి క్రమంగా స్వస్తి చెబుతున్నారు. దీంతో రైతుకు మేలు జరిగే వెద జల్లు సాగు విధానంలో రైతులు ముందుకు సాగుతున్నారు.

ఇందులో ప్రయోజనాలు

వెదజల్లు సాగు పద్ధతిలో నాట్లు వేయడం వల్ల విత్తన ఖర్చు ఎకరానికి 18 కేజీలు ఆదా అవుతుంది. నారు తయారు చేయడానికి ఎకరానికి అయ్యే ఖర్చు రూ.4 వేల మేరకు మిగులుతుంది. నాట్లు వేసే సమయంలో వరినారు తీయడానికి, నాట్లు వేసేందుకు కూలీలకు అయ్యే ఖర్చు ఎకరానికి సుమారు రూ.7 వేలు ఆదా అవుతుంది. ముఖ్యంగా కూలీల కొరతను అధిగమించవచ్చు. వెదజల్లులో విత్తనాలు పైపైనే పడి, తొందరగా పిలకలు వృద్ధి చెందుతాయి. ఒక్కొక్క మొక్క ఉండడంతో పోషక విలువలన్నీ మొక్కకు సమంగా అందుతాయి. గాలి, వెలుతురు సమాన స్థాయిలో ప్రసరించడంతో పంట ఆరోగ్యకరంగా పెరిగి, చీడపీడలు తక్కువగా ఆశిస్తాయి. దృఢమైన పిలకలు ఎక్కువగా ఉండడంతో, దిగుబడి ఐదు బస్తాలు అధికంగా ఉంటుంది.

వెద సాగులో మెళకువలు

సాధారణంగా వరిని సాగు చేసే అన్ని నేలలు వెద సాగుకు అనుకూలంగా ఉంటాయి. ముంపునకు గురయ్యే, చౌడు, క్షార, ఆమ్ల లక్షణాలున్న భూములు ఈ సాగుకు అనుకూలం కాదని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.

పొలం తయారీ

సాధారణ పద్ధతిలో వరి నాటేటప్పుడు భూమిని తయారు చేసినట్టుగానే ఈ వెదజల్లు సాగు పద్ధతిలో పొలం తయారు చేయాలి. పొలంలో నీరు నిల్వ ఉండరాదు. నీరు ఎక్కువైతే బయటికి పోవటానికి ఏర్పాట్లు చేయాలి. వీలైనంత బాగా చదును చేసుకోవాలి. పెద్దగా ఉన్న పొలాలను చిన్న మడులుగా విభజిస్తే.. చదును చేయడానికి, నీరు పెట్టడానికిచ విత్తనం చల్లడానికి అనుకూలంగా ఉంటుంది.

విత్తనాన్ని మండె కట్టే విధానం

విత్తనాలను 24 గంటలు నానబెట్టి, నానిన విత్తనాలను గోనె సంచిలో వేసి లేదా గోనె సంచి కప్పి కానీ 24 గంటల పాటు ఉంచాలి. 24 గంటల తర్వాత చూస్తే విత్తనాల ముక్కు పగిలి, తెల్లగా మోసు వస్తుంది. రబీ పంట కాలంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. దీంతో విత్తనాన్ని 36 గంటల మండె కట్టాలి. అనంతరం పొలంలో క్రమ పద్ధతిలో చల్లాలి.

రెండు నియోజకవర్గాల్లో..

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 57చ442 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917, రాజానగరంలో 8,060 ఎకరాల్లో అన్నదాతలు సాగుకు సిద్ధమయ్యారు. అయితే ఆయా మండలాల్లో సుమారు 80 శాతం మేరు రైతులు వెద జల్లు సాగు విధానంలో వరిని సాగు చేయడానికి సిద్ధమైనట్టు ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికీ ఐదు శాతం మేర వెదసాగు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

రబీ సాగుకు వరి రకాలు

ఈ రబీ సీజన్లో ఎంసీ 13, ఎంటీయూ 3626, ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 రకాలను సుమారు 80 శాతం రైతులు సాగు చేయనున్నారు. అలాగే మిగిలిన 20 శాతంలో విత్తనాల నిమిత్తం స్వర్ణ రకం సాగు చేయనున్నారు. ఆర్‌పీ బయో 226, ఇంకా బోండాలు, ప్రైవేటు వరి రకాలు రైతులు సాగు చేయవచ్చని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. అయితే తల్లి విత్తనం (ఫౌండేషన్ సీడ్స్) నుంచి సేకరించిన విత్తనాన్ని వాడటంతో పంట అంతా ఒకేలా ఉంటుంది.

ఇందులో ఖర్చు తక్కువ



వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు, మెరుగైన దిగుబడులు సాధించవచ్చు. మండలంలో పెదపూడి, జి.మామిడాడ, దోమాడ, తదితర గ్రామాల్లో రైతులు వెద జల్లు విధానంలో సాగు ప్రారంభించారు. అధిక సంఖ్యలో రైతులు వెదసాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వెదసాగుపై సూచనలు ఇస్తున్నాం.

– టీవీఆర్ మణిదీప్, వ్యవసాయాధికారి, పెదపూడి మండలం

కూలీల కొరతను అధిగమించడానికి..



ప్రస్తుతం కూలీల కొరత అధికంగా ఉంది. దానిని అధిగమించడానికే వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తే మేలు. ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

– టి.సత్యనారాయణ, రైతు, కరకుదురు గ్రామం

బహిరంగ ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబెట్టొద్దు

పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాధిక



బొల్లెద్దుపాలెంలో రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులతో మాట్లాడుతున్న రాధిక

మధురపూడి: రైతులు తమ ధాన్యాన్ని బహిరంగ ప్రదేశాల్లో ఆరబెట్టరాదని పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి.రాధిక అన్నారు. ఫెంగల్ తుపాను కారణంగా కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కోతలు నిర్వహిస్తున్నందున, ధాన్యాన్ని రైతులు బహిరంగ ప్రదేశాల్లో ఆరబెట్టవద్దన్నారు. ఈ విషయమై తనిఖీలు నిర్వహించారు. ఇందుకోసం క్షేత్ర స్థాయి పరిశీలనకు మండలంలోని రాఘవపురం, బొల్లెద్దుపాలెం, పశ్చిమ గానుగూడెం గ్రామాల్లో పర్యటించారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో వ్యవసా య, మార్కెటింగ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో జీవన్ముక్తి

బిక్కవోలు: అధ్యాత్మికత అంటే మనిషి తనను తాను తెలుసుకోవడమేనని ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, ఆత్మ జ్ఞాన ప్రబోధకులు వివేకనంద అన్నారు. మంగళవారం మండలంలోని బలభద్రపురంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ట్రూత్ వివేకామృతం ఆధ్యాత్మిక విజయోత్సవ వేడుకలు నాలుగో రోజు వైభవంగా సాగాయి. గురువుపై విశ్వాసం ఉన్న సాధకుడికి ఆత్మ జ్ఞానం సంపూర్ణంగా అవగతమై మోక్ష స్థితికి చేరుకుంటాడని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సాధకులు హాజరయ్యారు.

ఎలుకలతో అప్రమత్తం అవసరం

మధురపూడి: పంట నాశనానికి కారకాలైన ఎలుకలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ ఎస్.జయలక్ష్మి అన్నారు. మంగళవారం కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ శాఖ నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ సీజన్‌లో రైతులు మంచి దిగుబడులు సాధించేలా సాగుకు ఉపక్రమించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలంటే విద్యార్థినులకు అవగాహన ఉండాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. పిల్లలను లైంగిక వేధింపులకు గురిచేస్తే అటువంటి వారు కఠిన శిక్షలకు గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 సీవీ వీ.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు త్రిమూర్తులు, ఉపాధి పథకం ఏపీఓ సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి చిన్ని పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌కు నివాళి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూరాజేంద్ర ప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ఆయన చూపిన బాటలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణసాయి, పడాల ఈశ్వరరెడ్డి, లక్ష్మణరెడ్డి, మహ్మద్ వలిషా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా పంట బీమా



సీతారామపురంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఖాసిమ్

రాజానగరం: ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం ఏర్పడితే ఆయా రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో పంట బీమా పథకాన్ని అమలుచేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామి ఖాసిమ్ అన్నారు. మండలంలోని సీతారామపురం, కలవచర్లలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి పంటతో పాటు, మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటలకు కూడా బీమా చేయించుకోవచ్చన్నారు. ఎకరం విస్తీర్ణంలో సాగు చేసిన వరి పంటకు రూ.630, మొక్కజొన్నకు రూ.540, మినుము, పెసర పంటలకు రూ.300 ప్రీమియం చెల్లించాలన్నారు. ఇందుకు వరి పంటకు ఈ నెల 30, మిగిలిన పంటలకు 15 వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఈ గడువులోగా ఆయా పంటలకు బీమా చేయించుకుని, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పొందాలన్నారు. అలాగే రైతులంతా తాము పండించే పంటలను తప్పనిసరిగా ఈ-పంట చేయించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆయా పంటలకు పరిహారాలను పొందడంతో పాటు, పండించిన పంటలను విక్రయించుకునేందుకు కూడా ఇదెంతో అవసరమని వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు..

యువతకు ఆత్మవిశ్వాసమే ఆయుధం కావాలి



అనపర్తిలో వ్యక్తిత్వ వికాస సదస్సులో మాట్లాడుతున్న సేవ్యానందజీ మహరాజ్

పెదపూడి: యువతరానికి ఆత్మవిశ్వాసమే ఆలంబన కావాలని, వివేకానందుని సాహిత్యంలో అది పుష్కలంగా లభిస్తుందని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం ప్రతినిధి స్వామీ సేవ్యానందజీ మహరాజ్ అన్నారు. అనపర్తి జీబీఆర్ విద్యాసంస్థల సెమినార్ హాల్‌లో మంగళవారం స్థానిక రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస సదస్సులో స్వామీజీ ప్రధానకర్తగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ యువతరంలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీసి దేశ ప్రగతికి వినియోగించేలా వారిని కార్యోన్ముఖులను చేయాలన్నారు. కడప రామకృష్ణ మఠం ప్రతినిధి స్వామి సన్నివాసానందజీ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలతో ఉండాలని అది వివేకనందుని బోధనలను అధ్యయనం చేయడం ద్వారా లభిస్తుందన్నారు. స్థానిక సేవాసమితి ఉపాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, సమితి ఉపాధ్యక్షుడు తేతలి సుందరరామారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, మల్లిడి శ్రీనివాసారెడ్డి, దుర్గాప్రసాద్, జీబీఆర్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు ఊడిన గేర్ రాడ్



గేర్ రాడ్ ఊడిపోయి ఆగిన నాన్ స్టాప్ బస్సు

రాజానగరం: గతుకుల బొంతలా తయారైన రాజానగరం-కాకినాడ ఏడీబీ రోడ్డుపై ప్రయాణమంటేనే జనం హడలిపోతున్నారు. ముఖ్యంగా రాజానగరం నుంచి రంగంపేట వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో, ఈ ప్రాంతంలో ప్రయాణించే వాహనాలకు ఎప్పుడు, ఏ పార్టులు ఊడిపోతాయోనన్న భయం డ్రైవర్లను వెంటాడుతోంది. అదే టెన్షన్‌తో డ్రైవింగ్ చేయాల్సి వస్తోంది. తాజాగా కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి వెళ్తున్న నాన్ స్టాప్ ఆర్టీసీ బస్సు రామస్వామిపేట దాటాక గేర్ రాడ్ ఊడిపోయింది. గేర్ రాడ్ చేతికి రావడంతో డ్రైవర్ ఆ బస్సును అక్కడే ఆపివేశారు. ప్రయాణ సమయంలో బస్సులో సుమారు 40 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. వారిని అటుగా వచ్చిన వేరే బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు పంపించారు. చెరువులను తలపించేలా ఉన్న గోతులలో పడటంతోనే గేర్ రాడ్ విరిగి, ఊడిపోయిందంటూ ప్రయాణికులు రహదార్ల దుస్థితి, పాలకుల నిర్లక్ష్య వైఖరిని బాహాటంగానే తిట్టుకున్నారు.

దేశ రక్షణలో నేవీ చాలా కీలకం



సూరెడ్డి కృష్ణకుమార్



సూరెడ్డి శివకుమార్

సీతానగరం: దేశ రక్షణలో నేవీ చాలా కీలకమని విశ్రాంత నావికాదళ కమాండర్ సూరెడ్డి కృష్ణకుమార్ అన్నారు. మంగళవారం వంగలపూడికి చెందిన విశ్రాంత నేవీ కమాండర్ కృష్ణకుమార్, విశ్రాంత నేవీ ఛీఫ్ పెట్టీ ఆఫీసర్లు సూరెడ్డి నరేంద్రబాబు, రంధి శంకరం, విశ్రాంత నేవీ లాజిస్టిక్ ఆఫీసర్ సూరెడ్డి శివకుమార్ తదితరులు బుధవారం భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. విధి నిర్వహణలో దేశానికి వారందించిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వంగలపూడి నుంచి నౌకాదళంలో 22 మంది దేశ రక్షణలో పాలుపంచుకున్నారని తెలిపారు. ప్రతి దేశానికి రక్షణ కోసం సైనిక దళం ఉంటుందని, పదాతిసేన, వాయుసేన, నావికాసేన ఈ మూడు విభాగాలు సైనిక దళంలో కీలక భాగాలన్నారు. సముద్ర సరిహద్దు లేని దేశాలకు నావికాదళం ఉండదన్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ 4న నౌకాదళ దినోత్సవం జరుపుతామని, దీనికి విశిష్ట స్థానం ఉందన్నారు. 1971 భారత్‌= - పాకిస్థాన్ యుద్ధం ప్రత్యేకమైందని, దాని ఫలితంగానే బంగ్లాదేశ్ ఆవిర్భవించిందన్నారు. యుద్ధంలో ప్రణాళిక ప్రకారం పాకిస్థాన్‌ను తీవ్రంగా భారత సైన్యం దెబ్బతీసిందన్నారు. విశాఖపట్నం దగ్గరలో పాకిస్థాన్ జలాంతర్గామి ఘాజీని కూడా నౌకాదళం పేల్చివేసిందన్నారు. దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండటానికి నేవీ సైనికులు రాత్రింబవళ్లు రక్షణ కాస్తున్నారని వారు కొనియాడారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



జి.మామిడాడలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



సీతానగరం డిగ్రీ కళాశాలలో దివ్యాంగులతో ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు



దివాన్‌చెరువు కార్యక్రమంలో పాల్గొన్న సుభాషిణి



రంగంపేటలో దివ్యాంగ దినోత్సవంలో మాట్లాడుతున్న గౌరీశంకర్

పెదపూడి: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు కె.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ అన్నారు. జి.మామిడాడ భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత సెంటర్ ద్వారా అందజేస్తున్న సేవలను దివ్యాంగులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వారితో కేక్‌కట్ చేయించి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసు, సత్తి వెంకటరెడ్డి(ఎస్‌వీఆర్), నాగేంద్ర ప్రసాద్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ పి.మారుతి, ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయిని కల్ప, భవిత సెంటర్ ఉపాధ్యాయిని పి.జ్యోతి, విద్యార్థు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

సీతానగరం: దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. వారిని రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సహించేలా దృష్టి సారించాలన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ, దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీవీ నాగేశ్వరరావు, ఎస్‌డీ మదీనా, వీవీ సుబ్బారావు, ఎ.వాణి, అలేఖ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో మనోధైర్యం నింపాలి

రాజానగరం: దివ్యాంగులైన పిల్లలపై సానుభూతిని చూపకుండా, వారిలో మనోధైర్యాన్ని కల్పించేలా మనలో ఒకరిని చేసుకోవాలని సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో=ఆర్డినేటర్ సుభాషిణి అన్నారు. మండలంలోని దివాన్‌చెరువు భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటువంటి పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించడం వలన ప్రయోజనం ఉంటుందన్నారు. ఇందుకు భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. కాగా దివాన్‌చెరువులో నిర్వహిస్తున్న భవిత కేంద్రానికి 20 మంది పిల్లలు వస్తుంటే, అందులో 14 మంది రాజానగరం నుంచే వస్తున్నారన్నారు. ఈ కారణంగా ఆయా పిల్లల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు రాజానగరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఝాన్సీ, ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్, ఏఎంఓ గౌరీశంకర్, సీఎంలో శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అనపర్తిలో దివ్యాంగులకు స్టీల్ బాక్సులు పంపిణీ చేస్తున్న దాతలు, అధికారులు

మనోధైర్యంతో ముందుకు సాగాలి

పెదపూడి: ధరణికోట ఎంపీపీ పాఠశాలలో గల దివ్యాంగుల పాఠశాల, నాన్ భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఎంఈఓలు బి.పుష్పలత, నల్లమిల్లి సత్తిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. మనం సైతం ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనం సౌకర్యం ఏర్పాటు చేశారు. పలువురు దాతలు పిల్లలకు స్టీల్ బాక్సులు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు. నాన్ భవిత సెంటర్ సిబ్బంది ఏ.సత్యనారాయణ, పి.అనురాధ, కె.లావణ్య హాజరయ్యారు.

దివ్యాంగ విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

రంగంపేట: దివ్యాంగులైన చిన్నారులను సంరక్షిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకర్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న విద్య, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతున్న ఐఈఆర్టీలు ఎంవీఎస్ ప్రసాద్, అంజలిని ఆయన అభినందించారు. అనంతరం దివ్యాంగ చిన్నారులకు ఎంఈఓలు కె.శ్రీనివాసరావు, ఎం.మధుసూదనరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధిలతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్స్ మధుఫణి, సత్య, పంచాయతీ కార్యదర్శి వెలిశెట్టి శ్రీరామ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు చేయూత నివ్వాలి



బిక్కవోలులో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

బిక్కవోలు: దివ్యాంగ విద్యార్థులకు చేయూత అందించాలని ఎంపీడీవో వి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎంఈవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి బిక్కవోలు భవిత కేంద్రానికి చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ బీవీవీ కృష్ణ మాట్లాడుతూ జీవితంలో ఎదిగేందుకు అంగవైకల్యం అడ్డుకాదన్నారు. పోటీల్లో విజేతలకు అధికారులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ1 సత్యనారాయణ, ఎంఇవో-2 పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.